రూ. 400 కోట్లు పంచేశారు..!



- ఎన్నికల్లో భారీగా పంపకాలు
- జనం షాపింగ్ బాట
- మార్కెట్లో పెద్ద నోటు సందడి
- ఓట్ల సొమ్ముతో నేతల జల్సా

పుట్టపర్తి, మే20(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో నోట్ల వరద పారింది. జిల్లావ్యాప్తంగా ప్రధాన పార్టీలవారు రూ.400 కోట్ల మేర నగదు పంచేసినట్లు అంచనా. ప్రచారం మొదలుకుని ఓటుకు నోటు పంపిణీదాకా సగటున ఒక్కో అభ్యర్థి రూ.50 కోట్లు పైమాటే వెచ్చించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. హిందూపురం, రాప్తాడు, పెనుకొండ, పుట్టపర్తిలో అది కాస్తా రూ.70 కోట్లు దాటేసింది. ఇందులో అధికార వైసీపీ అభ్యర్థులు భారీగానే ఖర్చు చేశారు. సింహభాగం ఓటర్ల ప్రలోభాలకే ఖర్చు చేసినట్లు అంచనా. ప్రచారంలో జనసమీకరణకు రోజుకు సగటున రూ.అరకోటి ఖర్చు చేశారంటే ఏ మేరకు కరెన్సీ వరద పారిందో చెప్పనక్కర్లేదు. ఈనేపథ్యంలో జనానికి ఎన్నికల పండగొచ్చింది. వారం రోజులుగా మార్కెట్‌లో ఎన్నికల డబ్బుతో జల్సా చేస్తున్నారు. షాపింగ్‌తోపాటు వేసవి ఆటవిడుపు కోసం చల్లని ప్రాంతాలతోపాటు పుణ్యక్షేత్రాలకు క్యూ కడుతున్నారు. ప్రస్తుతం ఏ ఇద్దరు కలిసినా.. ఓటుకు ఎంత ఇచ్చారనీ, తమ ఇంట్లో ఇంత వచ్చిందనీ, ఆ డబ్బుతో ఫలానా వస్తువు కొన్నామని చర్చించుకుంటున్నారు. ఎన్నికల పుణ్యమా అని మార్కెట్‌లో రూ.500 నోట్లు చక్కర్లు కొడుతున్నాయి. అవన్నీ దుకాణాలకు చేరుతున్నాయి. వస్త్ర, గృహోపకరణాలు, మొబైల్, ఎలక్ట్రానిక్, బంగారు దుకాణాలకు రూ.500 నోటు చేరుతోంది. దీంతో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.



డబ్బులు వచ్చాయిలా...



జిల్లావ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లోనూ డబ్బు పంపిణీ జోరుగా సాగింది. పల్లెపట్నంలో కాస్తా అటు.. ఇటు.. అయినా పంపకాలు మాత్రం పక్కాగా చేశారు. ఓటుకు రూ.1500 నుంచి రూ.2500దాకా పంపిణీ చేశారన్నది బహిరంగ రహస్యమే. ఇంట్లో నాలుగైదు ఓట్లు ఉంటే ప్రధాన పార్టీల నుంచి రూ.20 వేల వరకు అందాయి. ఎక్కువ ఓట్లున్న కుటుంబాలకు రూ.30 వేలదాకా కూడా ముట్టాయి. తమకే ఓటు వేయాలని ప్రధాన పార్టీలు పోటీ పడి డబ్బు పంపిణీ చేశాయి. వైసీపీ అభ్యర్థులు పేద, మధ్యతరగతి వర్గీయులే లక్ష్యంగా కోట్లాది రూపాయలు కుమ్మరించాయి. మూడంచెల విధానంలో పంపిణీ చేశారు. ఓటర్లు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలకు వారం ముందు నుంచే పంపకాలు జరిగాయి. ఇలా జిల్లాలో 10లక్షల ఓటర్లకుపైగా సరాసరి ఓటుకు రూ.3వేలు చొప్పున చేతిలో పడ్డాయని అనుకున్నా.. ఆ అంకెను చూస్తే కళ్లు బైర్లు కమ్ముతాయి. ఆ లెక్కన జిల్లాలోని ఓటర్లకు అభ్యర్థులు అక్షరాలా రూ.300 కోట్లు పంపిణీ చేశారు. ఇక ప్రచారం ఇతర ఖర్చులు వేసుకుంటే మరో వంద కోట్లదాకా ఖర్చు చేశారు. ఈలెక్కన రూ.400 కోట్లుపైమాటే పంచేశారన్న మాట. జిల్లాలో ఎటుచూసినా రూ.500 నోట్లే దర్శనమిస్తున్నాయి.


ఎన్నికల పండుగ..



జిల్లాలో హిందూపురం, ధర్మవరం కదిరి. పుట్టపర్తి, పెనుకొండ, మడకశిర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో మాల్స్, దుకాణాలు ఆకర్షిస్తున్నాయి. కొన్నాళ్లుగా వ్యాపారాలు లేక ఉసూరమంటూ కనిపించిన దుకాణాలు వారం రోజులుగా జనాలతో సందడిగా మారాయి. పల్లెపట్నంలో ఓటు నోటుతో మద్యం షాపులు మొదలుకుని, వస్త్ర దుకాణాలు, గృహోపకరణలు, మొబైల్, బంగారు దుకాణాల వద్ద ఎన్నికల నోటు సందడి చేస్తోంది. ఎన్నికల పుణ్యామాని జిల్లాలో వ్యాపారవర్గాలకు కాసుల వర్షం కురుస్తోంది. ఎన్నికల ముందుకు పలు పథకాలకు బటన్ నొక్కుడుతో జమకాని నిధులు రెండు రోజులుగా ఖాతాల్లో పడుతుండడంతో ఆ నోట్లతో మార్కెట్ హుషారుగా మారింది.

నాయకుల జల్సా

ఎన్నికల షెడ్యూల్ విడుదలతో మార్చి 16 నుంచి ఈనెల 13వ తేదీదాకా ప్రధాన పార్టీల అభ్యర్థుల తరఫున నాయకులు, కార్యకర్తలు ప్రచారం మొదలుకుని, పోలింగ్‌దాకా బీజీగా గడిపారు. ఎన్నికల్లో క్రియాశీలకంగా పనిచేసిన వారికి కాస్తోకూస్తో నోటు చేతికందింది. ఓటుకు నోటు పంపకాల్లో ఆయా పార్టీల నాయకులు అందినకాడికి నొక్కేశారు. ఇలా నొక్కేసిన డబ్బుతో ఆటవిడుపు కోసం కొందరు చల్లని ప్రదేశాలకు క్యూకడితే.. మరికొందరు పుణ్యక్షేత్రాలకు వెళ్తున్నారు. అలా ఎన్నికల సొమ్ముతో జల్సా చేస్తున్నారు.



పలుప్రాంతాల్లో వర్షం

పుట్టపర్తి, మే 20: జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం వర్షం కురిసింది. ధర్మవరంలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. ముదిగుబ్బ, బత్తలపల్లి, మడకశిర, గోరంట్ల, ఓబుళదేవరచెరువు, గాండ్లపెంట, కదిరి, హిందూపురం, నంబులపూలకుంట, నల్లచెరువు ప్రాంతాల్లో చిరుజల్లులు రాలాయి. రెండు రోజులుగా వర్షం కురుస్తుండడంతో వాతావరణం చల్లబడింది.



పిడుగుపడి వ్యక్తి మృతి

బత్తలపల్లి: మండలంలోని ఉప్పర్లపల్లి సమీపంలోని కోళ్లఫారం వద్ద సోమవారం రాత్రి పిడుగుపడి వ్యవసాయ కూలీ చంద్రశేఖర్ (50) మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని దంపెట్ల గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఉప్పర్లపల్లి సమీపంలోని ఓ తోటలో పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులు మొదలవడంతో ఇంటికి నడుచుకుంటూ బయల్దేరాడు. మార్గమధ్యలో వర్షం మొదలవడంతో సమీపంలోని కోళ్ల ఫారం వద్దకు వెళ్తుండగా.. అతడికి సమీపంలోనే పిడుగు పడింది. ఆ శబ్దానికి భయపడిపోయిన చంద్రశేఖర్ కోళ్ల ఫారం వద్దకెళ్లి, నీరు తాగి పడిపోయాడు. అక్కడున్నవారు చూసేసరికి అప్పటికే మృతిచెందాడు. విషయన్ని గ్రామస్థులు.. కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు వచ్చి, బోరున విలపించారు. చంద్రశేఖర్‌కు భార్య ప్రమీల, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



ఆస్పత్రిలో కోడ్ ఉల్లంఘన



సీఎం, ఎమ్మెల్యే ఫొటోలను తొలగించని వైనం

పట్టించుకోని ఆస్పత్రి అధికారులు

ధర్మవరం రూరల్, మే20: ధర్మవరంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం ఆస్పత్రిలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. ఆస్పత్రిలోకి వెళ్లగానే శిలాఫలకాల బోర్డులపై సీఎం జగన్, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ ఫొటోలు దర్శనమిస్తున్నాయి. కోడ్ అమలులో ఉన్నా.. వాటిని తొలగించకుండా అలానే వదిలేశారు. కోడ్ అమలులో వైద్యసిబ్బంది నిర్లక్ష్యం వహించారు. ఇప్పటికైనా వాటిని తొలగిస్తారో, లేదో.. చూడాలి మరి.

ఆస్పత్రిలో శిలాఫలకంపై సీఎం, ఎమ్మెల్యే ఫొటోలు



గరుడవాహనంపై విహరిస్తున్న లక్ష్మీచెన్నకేశవస్వామి

ఇష్టవాహనంపై చెన్నకేశవుడు

గరుత్మంతుడిపై విహారం.. నేడు రథోత్సవం...

ధర్మవరంరూరల్, మే 20: పట్టణంలో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల ఆరోరోజు సోమవారం స్వామివారు.. శ్రీదేవి, భూదేవి సమేతుడై ఇష్టవాహనమైన గరుడుడిపై విహరించారు. ఉదయం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, గరుడవాహనంపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాలు, వందలాది మంది భక్తుల నడుమ పురవీధుల్లో స్వామివారు ఊరేగారు. సాయంత్రం శేష, గజవాహనాపై స్వామివారు విహరించారు.

నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు ఈఓ వెంకటేశులు తెలిపారు. ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆ లయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పల్లకిలో తేరుబజార్‌లో ఉన్న ర థం వద్దకు తీసుకొస్తారు. ఉదయం 7.30 గంటలకు రథాన్ని లాగుతారు.



సిద్ధమవుతున్న రథం

నాణ్యమైన విత్తనాలే సరఫరా చేయాలి

- జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు

ధర్మవరంరూరల్, మే20: రైతులకు సరఫరా చేసే విత్తన వేరుశనగలో నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు సూచించారు. పట్టణంలోని వేరుశనగ శుద్ధికేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. విత్తన కాయల నాణ్యతను పరిశీలించారు. ఇంతవరకు ఎన్ని క్వింటాళ్లు శుద్ధి చేశారనీ, ఎంతమేర సరఫరా చేశారని ఏపీ సీడ్స్ శుద్ధికేంద్రం యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏఈఓ క్రిష్ణయ్య, ఏఓ ముస్తాఫా, ఏఈఓలు జగదీష్, అశ్విని, ఉపేంద్ర, ప్రతిభ, ఏపీ సీడ్స్ సిబ్బంది సురేష్ పాల్గొన్నారు.



విత్తన వేరుశనగను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

చిరుధాన్యం చిక్కేనా?

ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేసేనా?.. రైతుల ఎదురుచూపు





తనకల్లు, మే 20: ఖరీఫ్‌లో ముందస్తు వర్షాలు కురుస్తున్నాయి. రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది తీవ్ర వర్షాభావంతో వాటిల్లిన నష్టాలను మరచి, పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. వేరుశనగ సాగు చేద్దామంటే పెట్టుబడి ఎక్కువ అవసరం. అంత డబ్బు రైతుల చేతిలో లేదు. అప్పు పుట్టే పరిస్థితి కూడా లేదు. ఇన్ని కష్టాలకోర్చి ఎలాగోలా పంట సాగుచేస్తే.. చేతికొస్తుందన్న నమ్మకం అంతకన్నా లేదు. ఈ నేపథ్యంలో నవ, చిరుధాన్య పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. చిరుధాన్య విత్తనాలు బయట మార్కెట్‌లో దొరకడం కష్టంగా ఉంది. ప్రభుత్వం సబ్సిడీతో సరఫరా చేస్తే ఎంతో కొంత ఉపశమనం దక్కుతుందని కరువు రైతు ఆశిస్తున్నాడు. ప్రస్తుతం ప్రభుత్వం సబ్సిడీపై వేరుశనగ విత్తన కాయలు సరఫరా చేస్తోంది తప్ప.. చిరుధాన్యాల ఊసే ఎత్తట్లేదు. దీంతో అన్నదాతలు నిరాశ చెందుతున్నారు. టీడీపీ పాలనలో రైతులకు నవ, చిరుధాన్యాలు, ప్రత్యామ్నాయ పంటలైన ఉలవ, పెసర, కంది, జొన్న తదితర విత్తనాలను ఉచితంగా, సబ్సిడీ ధరలతో అందించారు. ప్రస్తుతం వేరుశనగకు మాత్రమే సబ్సిడీని ప్రభుత్వం ప్రకటించింది. మిగిలిన నవ, చిరుధాన్యాల ఊసెత్తకపోవడం పట్ల రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చిరుధాన్యాలను సబ్సిడీ ధరలతో అందించాలని కోరుతున్నారు.

వేరుశనగ సాగుచేయలేం

మూడు, నాలుగేళ్లుగా వేరుశనగ సాగుచేసి, నష్టపోయాం. మళ్లీ అదే పంట పెట్టలేం. సన్న, చిన్నకారు రైతులు చిరుధాన్యాల సాగుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీతో అందించాలి.



- శంకర్, రైతు, పెద్దపల్లి

నవధాన్యాలు అందించాలి

టీడీపీ హయాంలో మన విత్తన కేంద్రాల ద్వారా 75 శాతం సబ్సిడీతో ఐదు కిలోల నవధాన్యాల ప్యాకెట్‌ను రూ.125కి సరఫరా చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. వెంటనే ప్రభుత్వం నవధాన్యాలను సబ్సిడీ ధరలతో సరఫరా చేయాలి.



శ్రీరాములు నాయక్, రైతు, పెద్దపల్లి

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

మండలంలోని వివిధ గ్రామాల రైతులు నవ, చిరుధాన్యాల కోసం వినతిపత్రాలు అందిస్తున్నారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వం సరఫరా చేస్తే పంపిణీ చేస్తాం.

-శ్రీహరినాయక్, ఏఓ, తనకల్లు



ఖాకీ

స్వాహాపర్వం..?



పోలింగ్‌కు ముందు పలుచోట్ల నగదు పట్టివేత

లెక్కల్లో చూపని పోలీసులు

రూ.లక్షలు ఏమయ్యాయో తేలని వైనం

అధికార పార్టీ కోసం సర్వం ఒడ్డిన ఓ పోలీసు అధికారి

కదిరి, మే 20: ఎన్నికల వేళ నియోజకవర్గంలో పోలీసు స్వాహాపర్వానికి తెరలేపారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలింగ్‌కు ముందు రూ.లక్షల్లో పట్టుబడిన డబ్బు స్వాహా చేసినట్లు చర్చ సాగుతోంది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నపుడు నిబంధనల ప్రకారం ఓ వ్యక్తి రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లరాదు. తీసుకెళ్తే అందుకు లెక్కలు, పత్రాలు ఉండాలి. లేదంటే పోలీసులు సీజ్ చేస్తారు. ఎక్కువ మొత్తం పట్టుబడితే కేసు కట్టాల్సి ఉంది. పోలింగ్‌కు రెండురోజుల ముందు పట్టణంలో పట్టుబడిన రూ.లక్షల డబ్బును పోలీసు అధికారులే తీసుకుని, కేసు నమోదు చేయకుండా తమ వద్దే ఉంచుకున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇలా నియోజకవర్గం వ్యాప్తంగా పలుచోట్ల పట్టుబడిన నగదు పోలీసు పరమైనట్లు బహిరంగంగానే చర్చలు సాగుతున్నాయి. ఓ పోలీసు అధికార అయితే అధికార పార్టీ కోసం సర్వం ఒడ్డారన్న ఆరోపణలు మూటగట్టుకున్నారు.

- 11వ తేదీ రాత్రి కదిరిలోని నిజాంవలీ సర్కిల్‌లో చిన్నపాటి వాగ్వాదం సాగుతోంది. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ పార్టీ నాయకుడు ఓటర్లకు పంచడానికి తనకు తక్కువ ఇచ్చారనీ, రూ.8లక్షలు గ్రామానికి అవసరం కాగా.. రూ.3లక్షలే ఇచ్చారనీ, ఇది తనకవసరం లేదని, డబ్బు తీసుకు వచ్చిన వ్యక్తితో వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. దీంతో ఆగ్రహించిన ఆ గ్రామస్థాయి నాయకుడు.. తనకు డబ్బు వద్దంటూ పక్కనే ఉన్న తన కారులోకి విసిరాడు. ఆ సమయంలో అటుగా వచ్చిన పోలీసు అధికారి దీనిని గమనించి, కారులోని రూ.3 లక్షలు పట్టుకెళ్లినట్లు సమాచారం. కనీసం ఆ కారు, డబ్బు ఎవరిది, ఎక్కడి నుంచి వచ్చింది అన్న వివరాలు కూడా విచారించకుండానే డబ్బు తీసుకెళ్లినట్లు తెలిసింది. ఆ డబ్బు పట్టుకున్నట్లు ఎక్కడా ప్రకటించలేదు. లెక్కలూ చూపలేదు. ఈ లెక్కన ఆ అధికారే స్వాహా చేశాడన్న మాట.
- తలుపుల మండలంలో ఓ పార్టీ నాయకుడు డబ్బు పంచుతుండగా ఓ అధికారి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిసింది. ఆ డబ్బును స్వాధీనం చేసుకుని, అతడిపై కేసు నమోదు చేయాల్సి ఉంది. డబ్బు పట్టుకున్న అధికారి కేసు నమోదు చేయడానికి సిద్ధమయ్యారు. పై అధికారి రంగప్రవేశం చేసి, ఆ డబ్బు తీసుకుని, కేసు నమోదు చేయకుండా పంపించేసినట్లు సమాచారం.
- గాండ్లపెంట మండలంలోని రెక్కమాను వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. ఓ పార్టీకి చెందిన కార్యకర్తలు దాదాపు రూ.15లక్షలు తీసుకెళ్తూ పట్టుపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసు అధికారి వెంటనే వారిని స్వయంగా గమ్యస్థానానికి చేర్చినట్లు సమాచారం.
- కదిరి పట్టణంలో పనిచేస్తున్న ఇద్దరు పోలీసు సిబ్బంది దగ్గరుండి తలుపుల మండలానికి మందు సరఫరా చేయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- ఎన్నికలకు సంబంధంలేని ఇద్దరు కానిస్టేబుళ్లు పట్టణంలో ఓ పార్టీ వారిని వెంటబెట్టుకుని ఓటర్లకు డబ్బు పంచడానికి సహకరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెద్ద మొత్తంలో వీరుకూడా డబ్బు వెనకేసుకున్నట్లు సమాచారం. ఎన్నికలు ముగిసిన తరువాత పోలీసుల అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తుండడం ప్రజలను ఆశ్చర్యపరుస్తోంది. దీనిపై పట్టణంలో చర్చ సాగుతోంది. ఈవ్యవహారంలో ఓ పోలీసు అధికారి అన్నీ తానై ఓ పార్టీకి కొమ్ముకాసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసులు నిష్పాక్షికంగా వ్యవహరించకుండా ఇలా చేయడమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వీటిపై పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, నిజానిజాలు నిగ్గుతేల్చాలని వారు కోరుతున్నారు.



కౌంటింగ్‌లో ఆర్వోలే కీలకం: కలెక్టర్



పుట్టపర్తి, మే 20: సార్వత్రిక ఎన్నికల కౌటింగ్‌లో ఆయా నియోజకర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారు (ఆర్వో)లు కీలకపాత్ర పోషించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఎన్నికల కౌంటింగ్‌కు ముందస్తు ఏర్పాట్లపై ఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయా నియోజకవర్గాల్లో శాంతిభద్రతలను పర్యవేక్షించాలన్నారు. ఫలితాల ప్రకటన అనంతరం సంబంధిత ఈవీఎంలు, వీవీ ప్యాట్లను పటిష్టమైన బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చాలని ఆదేశించారు. కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో హిందూపురం ఆర్వో, జేసీ అభిషేక్ కుమార్, డీఆర్వో కొండయ్య, పెనుకొండ సబ్‌కలెక్టర్, ఆర్వో అపూర్వ భరత్, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, మడకశిర ఆర్వోలు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా పటిష్ట బందోబస్తు

- ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి రూరల్, మే 20: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం జిల్లాలో అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామగ్రామానా కార్డెన్ సెర్చ్‌లు చేపట్టామన్నారు. అల్లర్లు తలెత్తకుండా ప్రజలక విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గొడవలకు దిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పెన్నహోబిలానికి ఉత్సవమూర్తులు

నేడు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

ఉరవకొండ, మే 20: పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉత్సవమూర్తులను ఆమిద్యాల నుంచి సోమవారం క్షేత్రానికి చేర్చారు. మొదట ఆమిద్యాలలోని పెన్నోబులేశుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాల నడుమ ఊరేగింపుగా పెన్నహోబిలానికి తీసుకు వచ్చారు. ఈవో విజయ్‌కుమార్, ప్రధానార్చకుడు ద్వారకానాథాచార్యులు స్వామివార్లకు స్వాగతం పలికారు. బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణంతో మంగళవారం అంకుర్పాణ చేయనున్నారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో తెలిపారు.

వాహన సేవలు...

బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ధ్వజారోహణం, ప్రాకారోత్సవం నిర్వహిస్తారు. 22న సింహవాహనోత్సవం, చంద్రప్రభ వాహనోత్సవం, 23న గోవాహనోత్సవం, శేషవాహనోత్సవం, 24న హంసవాహనోత్సవం, 25న హనుమంత వాహనోత్సవం, 26న గరుడ వాహనోత్సవం, కల్యాణోత్సవం, 27న ఐరావత వాహనోత్సవం, 28న రథోత్సవం, 29న అశ్వవాహనోత్సవం, 30న ధ్వజావరోహణం, శయనోత్సవం నిర్వహిస్తారు. 31న ఉత్సవమూర్తులు పెన్నహోబిలం నుంచి ఆమిద్యాలకు చేరుస్తారు. అంతటితో ఉత్సవాలు ముగుస్తాయి.

అనంత చరిత్రను భావితరాలకు అందించాలి

కలెక్టరు వినోద్ కుమార్



సమీక్షా సమావేశంలో కలెక్టరు వినోద్ కుమార్, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న

అనంతపురం టౌన్, మే 20: జిల్లా చరిత్రను భావితరాలకు అందించడానికి ప్రత్యేకంగా పుస్తకాన్ని ముద్రించేలా చూడాలని పురావస్తుశాఖ అధికారులకు కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో ఆయన సోమవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో చారిత్రక ప్రాధాన్యం ఉన్న కట్టడాలు, భవనాలు, స్థలాలను గుర్తించాలని, వాటి చరిత్ర గురించి ఆర్కియాలజీ, ఆసక్తి ఉన్న ఇంటాక్ సభ్యులు పరిశోధన జరపాలని సూచించారు. చారిత్రక ప్రాధాన్యాన్ని పుస్తక రూపంలో తీసుకువస్తే భావితరాలు తెలుసుకుంటాయని అన్నారు. ఇందుకోసం జిల్లా టూరిజం కౌన్సిల్‌ని ఏర్పాటు చేసి.. ఆర్కియాలజీ, ఇంటాక్ సభ్యులు ఒక బృందంగా పనిచేయాలని సూచించారు. జిల్లాకు పేరు తెచ్చేందుకు అందరూ కలిసి పనిచేయాలని, జిల్లా సంస్కృతిని పరిరక్షించుకోవాలని సూచించారు. ఇందుకు తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టరు రజిత, టెక్నికల్ అసిస్టెంట్ మహేంద్రనాయుడు, ఇంటాక్ కో కన్వీనర్ చంద్రహాస్‌రెడ్డి, లైఫ్ మెంబరు డాక్టర్ రమేష్‌నారాయణ పాల్గొన్నారు.

చీనీకాయలు టన్ను రూ.37 వేలు

అనంతపురం రూరల్, మే 20: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.37 వేలు, కనిష్ఠంగా రూ.16 వేలు, సరాసరి రూ.24 వేల ధరకు అమ్ముడుపోయాయని మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 895 టన్నుల చీనీ కాయలు వచ్చాయని తెలిపారు.

ధర్మవరం గాయనికి గ్లోబల్ ఐకాన్ అవార్డు



సోమిశెట్టి సరళకు అవార్డు అందజేస్తున్న ప్రముఖులు

ధర్మవరంరూరల్, మే20: దర్మవరం పట్టణానికి చెందిన గాయని సోమిశెట్టి సరళ గ్లోబల్ ఐకాన్ అవార్డు అందుకున్నారు. హైదారాబాద్‌లోని రవీంద్ర భారతిలో సోమవారం మంజునాథ ఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా పలువురికి గ్లోబల్ ఐకాన్ అవార్డులను ప్రదానం చేశారు. ఇందులో సోమిశెట్టి సరళ కూడా ఉన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ రామచంద్రుతేజావత్, ఐఆర్‌సీఎస్ చైర్మన్ మామిడి భీంరెడ్డి, ఎంపీ కృష్ణయ్య, ఎమ్మెల్యే పద్మారావు, తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్, మంజునాథ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మంజులాగౌడ్ చేతులమీదుగా సరళ అవార్డు అందుకున్నారు.

జోరుగా... ముంగారు సేద్యం..!

ఈసారి తొలకరి ముందే పలకరించింది.. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. గత సంవత్సరం వర్షం ఎప్పుడు వచ్చిందో.. ఎప్పుడు పోయిందో తెలియకుండానే గడిచిపోయింది. ఈ ఏడాది మంచి వర్షాలు పడతాయని వాతావరణ శాఖ చెబుతుండడంతో రైతులకు ఆశలు చిగురించాయి. మే నెలలో ముంగార్ల సేద్యాలు చేసుకుని జూన్‌లో పడే వర్షాలకే విత్తనం వేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు.



పొలంలో వేసిన ఎరువు

- జిల్లావ్యాప్తంగా వర్షాలు
- దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకుంటున్న రైతులు
- ట్రాక్టర్ సేద్యానికి డిమాండ్
- ఖరీఫ్ సాగుకు రైతాంగం సమాయత్తం

అనంతపురం అర్బన్/ గుత్తి రూరల్, మే 20: జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ముంగార్ల సేద్యాలు మొదలయ్యాయి. కొన్నిరోజులుగా జిల్లాలో వర్షాలు పడుతుండటంతో దుక్కులు చేసుకోవడంపై రైతులు నిమగ్నమయ్యారు. ఖరీఫ్‌లో జిల్లా సరాసరి సాధారణ సాగు విస్తీర్ణం నాలుగు లక్షల హెక్టార్లు. ప్రతి ఏడాది 3.50 లక్షల హెక్టార్లకుపైగా పంటలు సాగవుతున్నాయి. జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ మొదలుకానుంది. సకాలంలో వర్షాలు పడితే విత్తనం వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఆశించిన స్థాయిలో వానలు పడితే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

ట్రాక్టర్లకు డిమాండ్..!

జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు పడడంతో వేసవి దుక్కులకు డిమాండ్ పెరిగింది. ట్రాక్టర్ ద్వారా ఐదు మడకలు, రెండు మడకలు, ఒక మడక, టిల్లర్‌తో పొలాల్లో దుక్కులు చేసుకుంటున్నారు. ప్రాంతాల వారీగా భూమి స్వభావాన్ని బట్టి బాడుగలు నిర్ణయించారు. కొన్ని ప్రాంతాల్లో రెండు మడకలు, మూడు మడకలు, ఐదు మడకలతో దుక్కి చేసేందుకు గంటకు రూ.1000 నుంచి రూ.1100, ఏడు మడకలకు గంటకు రూ.1200 వసూలు చేస్తున్నారు. ఏడు మడకలకు ఎకరాకు రూ.600 నుంచి రూ.700 నిర్ణయించారు. డోజర్ ట్రాక్టర్‌తో గంటకు రూ.1000 నుంచి రూ.1100 వసూలు చేస్తున్నారు. టిల్లరుకు ఎకరాకు రూ.800 తీసుకుంటున్నారు. కాడెద్దులతో చెక్కల గుంటకతో దుక్కి చేసేందుకు ఎకరాకు రూ.500 తీసుకుంటున్నారు. గతేడాదితో పోలిస్తే ట్రాక్టర్‌తో వేసవి దుక్కులు చేసేందుకు గంటకు రూ.100కుపైగా బాడుగ పెరిగింది. ఒక గంటకు ఒకటిన్నర నుంచి రెండెకరాల్లో దుక్కులు పూర్తి చేస్తున్నారు. డీజిల్ ధర పెరడంతో బాడుగలు పెంచేశారు. కొన్ని ప్రాంతాల్లో నాలుగు గంటలకు ఐదెకరాల్లో దుక్కులు చేసేలా ట్రాక్టర్ యజమానులు రైతులతో ఒప్పందం కుదుర్చుకుంటున్నారు.



గుత్తి రూరల్ మండలంలో ట్రాక్టర్‌తో దుక్కులు దున్నుతున్న దృశ్యం

వేసవి దుక్కులతో ప్రయోజనాలివీ..!

వేసవి దుక్కులు చేయడం ద్వారా భూమి, పంటలకు చాలా ఉపయోగకరం. ఎక్కువ శాతం మంది రబీ పంటలు కోయగానే పొలాన్ని అలాగే వదిలేస్తారు. తొలకరి వర్షాలు పడిన సమయంలో ఖరీఫ్‌కు సన్నద్ధమవుతారు. అంతకంటే ముందు వేసవిలోనే దుక్కులు దున్నుకుంటే ప్రయోజనం ఉంటుంది. భూమి లోపల పొరల్లో దాగి ఉండే కీటకాలు గుడ్లు, శిలీంద్రాలు వేసవి దుక్కులు చేయడం ద్వారా బయటపడి ఎండ తీవ్రతకు చనిపోతాయి. దుక్కుల ద్వారా భూమిలో కోశస్థ దశలోని పురుగులు నేలపైభాగానికి రావడంతో పొలాలపై తిరిగి కాకులు, కొంగలు, వివిధ రకాల పక్షులు వాటిని తినేస్తాయి. పంట కోత తర్వాత మిగిలిన అవశేషాలు, చెత్తాచెదారం లోతు దుక్కులు చేయడంతో పూర్తిగా కుళ్లిపోయి సేంద్రియ పదార్థంగా మారి పంటలకు బలాన్నిస్తాయి. కలుపు మొక్కలు చనిపోతాయి. వేసవి దుక్కులతో గట్టిగా ఉండే భూమి గుల్లబారుతుంది. తద్వారా వర్షం పడిన సమయంలో భూమిలోకి నీరుచొచ్చుకొని పోయే స్వభావం, నీటి ని నిల్వ ఉంచుకునే సామర్థ్యం పెరుగుతుంది. విత్తనం విత్తేందుకు అనుకూలంగా ఉంటుంది. భూమిని దున్నడం ద్వారా భూమి పొరల్లోకి గాలి బాగా చేరుతుంది. తద్వారా సూక్ష జీవుల సాంద్రత పెరిగి, సేంద్రియ కర్బనం బాగా పెరుగుతుంది. తద్వారా భూమిలోని పోషకాలను మొక్క గ్రహించేందుకు అనుకూలంగా ఉంటుంది. వేసవిలో భూమిని దున్నేటప్పుడు వాలుకు అడ్డంగా దున్నాలి. తద్వారా గాలి, వర్షం నీటి ద్వారా భూమి కోతకు గురికాకుండా ఎక్కడ పడిన వర్షపు నీరు అక్కడే పడి ఇంకిపోతుంది.

బాడుగలు పెరిగాయి



నాకు ఐదు ఎకరాల పొలం ఉంది. వర్షం రావడంతో వేసవి దుక్కులు చేసుకున్నా. గతేడాదితో పోలిస్తే ట్రాక్టర్‌తో దుక్కులకు బాడుగ పెరిగింది. డీజిల్ ధర పెరగడంతోనే ధరలు పెంచారు. వేసవి దుక్కులు తప్పని సరికావడంతో ఖర్చుకు వెనుకాడలేదు. మరో సారి పదును వర్షం పడితే విత్తనం వేసేస్తా.

- రాముడు, రైతు, బేతాపల్లి, గుత్తి మండలం

పొలాన్ని సిద్ధం చేస్తున్నా..



నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. ఖరీఫ్ సీజన్‌కు పొలాన్ని సిద్ధం చేసుకుంటున్నా. వర్షం పడటంతో పొలంలో దుక్కి చేయించా. పొలంలో సేంద్రియ ఎరువు చల్లుకుంటున్నా. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత అదునులో వర్షం పడితే దేవుడిపై భారం వేసి వేరుశనగ విత్తనం వేస్తా.

-శివ, రైతు, కొత్తపేట, గుత్తి మండలం

వేసవి దుక్కులు చాలా ముఖ్యం



వేసవి దుక్కులు చేసుకోవడం చాలా ముఖ్యం. వేసవిలో భూమిని దుక్కి దున్నకుండా వదిలేస్తే కలుపు మొక్కలు ఎక్కువగా పెరగడంతోపాటు భూమిలో ఉండే నీటిని, పోషక పదార్థాన్ని గ్రహిస్తాయి. దీంతో భూమి లోపలి పొరల నుంచి నీరు ఆవిరైపోతుంది. తద్వారా భూసారం తగ్గడంతోపాటు సాగు చేసిన పంటలకు అవసరమైన పోషకాలు లభించవు. అలాగే ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం కష్టమవుతుంది. గత కొన్ని రోజులుగా కురిసే వర్షాలను ఉపయోగించుకొని భూమిని 2 నుంచి 3 అడుగుల లోతు దుక్కి చేసుకుంటే మంచి ఫలితాలొస్తాయి.

- ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి

ఏలికలారా..! పట్టించుకోండి..!

- కణేకల్లు చెరువులో పేరుకుపోతున్న పూడిక
- ఏటేటా తగ్గుతున్న నీటి నిల్వ సామర్థ్యం
- ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

కణేకల్లు, మే 20: రాయలసీమలోని అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలకు వెళ్లే తుంగభద్ర నీటికి రిజర్వాయర్‌గా ఉపయోగపడుతున్న కణేకల్లు చెరువులో పూడిక పెరిగిపోతోంది. ఏటేటా పెరుగుతున్న పూడికతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువులో పూడిక తీసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే చెరువులోకి నీరు వస్తే ఏ ప్రాంతంలో ఎప్పుడు గండ్లు పడతాయోనని రైతులు భయాందోళన చెందుతున్నారు.

2500 ఎకరాల్లో చెరువు నిర్మాణం



చెరువులో పేరుకుపోయిన పూడిక

శ్రీకృష్ణదేవరాయల పాలనా కాలంలో శ్రీచిక్కణ్ణేశ్వర వడయార్ అనే సంస్థానాధీశుడు 2500 ఎకరాల విస్తీర్ణంలో ఈ చెరువును నిర్మించినట్లు పెద్దలు చెబుతారు. చెరువు నిర్మించి ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేసిన చిక్కణ్ణేశ్వరుడికి ఆలయాన్ని నిర్మించి ఆయన్ను దేవుడిగా ఈ ప్రాంత ప్రజలు ఇప్పటికీ కొలుస్తున్నారు. 0.5 టీఎంసీల సామర్థ్యం గల చెరువులో పూడిక పెరిగిపోవడంతో 0.3 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంటోంది.

బలహీనంగా చెరువు గట్లు

వందల సంవత్సరాల కిందట పటిష్ఠంగా నిర్మించిన చిక్కణ్ణేశ్వర వడయార్ చెరువు గట్లు ప్రస్తుతం బలహీనంగా మారాయి. తుంగభద్ర డ్యాం నుంచి హెచ్చెల్సీ ద్వారా దాదాపు 2500-3000 క్యూసెక్కుల మేర నీరు ఒక్కసారిగా చెరువులోకి చేరుతోంది. ఆ ఉధృతిని తట్టుకోలేక పలుమార్లు చెరువుకు గండ్లు పడ్డాయి. ఇటీవల చెరువు కల్వర్టు కూడా కుప్పకూలిన విషయం తెలిసిందే. పాలకుల నిర్లక్ష్యం కారణంగా చెరువు పరిస్థితి నానాటికి తీసుకట్టుగా మారుతోంది.

ఆక్రమణలో చెరువు భూములు

ఒకప్పుడు 2500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు స్వార్థపరుల ఆక్రమణల వల్ల ప్రస్తుతం రెండువేల ఎకరాలకు తగ్గిపోయింది. కొత్తపల్లి, ఆదిగానిపల్లి, కణేకల్లు పరిసరాలలో చెరువు భూములను ఆక్రమించుకుని పంటలు సాగు చేసుకుంటున్నారు. దీనిపై హెచ్చెల్సీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో భవిష్యత్‌లో చెరువు ఇంకెంత ఆక్రమణకు గురవుతుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కణేకల్లు శ్రీచిక్కణ్ణేశ్వర వడయార్ చెరువు

రెండు పంటలు పండించుకునేవాళ్లం



శ్రీచిక్కణ్ణేశ్వర చెరువు కిందే మా భూములు ఉన్నాయి. దాదాపు ఆరునెలల పాటు చెరువులో నీటి నిల్వ ఉండేది. దీంతో మేము ఖరీఫ్‌తో పాటు రబీలో కూడా వరి పంట పండించుకునేవాళ్లం. ప్రస్తుతం చెరువులో పూడిక వల్ల కేవలం ఖరీఫ్‌లో మాత్రమే పంటలు పండించుకుంటున్నాం.

- కుద్దూస్, రైతు, కణేకల్లు

టీడీపీ హయాంలో రూ.రెండు కోట్లతో పూడికతీత

కణేకల్లు చెరువులో పేరుకుపోయిన మట్టి గురించి టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రైతులు అప్పటి మంత్రి కాలవ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి పూడికతీత కోసం రూ.రెండు కోట్ల నిధులు విడుదల చేయించారు. పూడిక తీయడంతో అప్పట్లో చెరువులో నీటి సామర్థ్యం పెరిగింది. అయితే ఐదేళ్ల వైసీపీ పాలనలో చెరువు గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో పూడిక యథాప్రకారం పెరిగిపోయింది. అధికారులు శ్రీచిక్కణ్ణేశ్వర వడయార్ చెరువుపై దృష్టి పెట్టి పూడికతీయించాలని రైతులు కోరుతున్నారు.

తీవ్ర నిర్లక్ష్యం



ఐదేళ్ల వైసీపీ పాలనలో కణేకల్లు చెరువు గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. రూపాయి కూడా మరమ్మతుల కోసం వినియోగించలేదు. ఎంతో చరిత్ర గలిగిన చిక్కణ్ణేశ్వర చెరువుపై నిర్లక్ష్యం పాలకులకు పనికిరాదు. రాబోయే ప్రభుత్వాలు చెరువు గురించి పట్టించుకుని మరమ్మతులు చేయించాలి.

- వేలూరు మరియప్ప, చెరువు సంఘం మాజీ అధ్యక్షుడు

కర్ణాటక కిక్కు @ రూ.100 కోట్లు..!

- ఓటర్లను మద్యం మత్తులో దింపిన అభ్యర్థులు
- పోలింగ్ రోజు రూ.వందకోట్ల మద్యం హాంఫట్
- రెండు నెలలు ఏరులై పారిన పొరుగు మద్యం





ఇటీవల తనిఖీల్లో పట్టుబడిన కర్ణాటక మద్యం (ఫైల్)

హిందూపురం, మే 20: ఎన్నికల చరిత్రలో ఎన్నడూలేని విధంగా ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ఆయా పార్టీల అభ్యర్థులు మద్యం మత్తులో ముంచెత్తారు. రెండు నెలలపాటు తాగేవారికి తాగినంత అనేలా మత్తులో దింపారు. ఈసారి కర్ణాటక మద్యం శ్రీసత్యసాయి జిల్లాలో ఏరులై పారిందని చెప్పవచ్చు. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచే ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు మత్తులో ముంచే ప్రయత్నం చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగించిన అరాచకాలు, దౌర్జన్యాలు గుర్తుకు రాకూడదనే ఉద్దేశంతో ఆ పార్టీ ముఖ్యనేతలు ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు మత్తులో దించారు. మద్యం వ్యాపారాలు సైతం ప్రభుత్వమే నిర్వహించింది. 2019 ఎన్నికలకు ముందు మద్యపాన నిషేధం పూర్తిగా అమలుచేసి, 2024లో ఓటు అడుగుతానని వైసీపీ అధినేత జగన్ హామీ ఇచ్చాడు. దానిని అమలు చేయకపోగా.. ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహించింది. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లకు పక్కరాష్ట్రం మందుతో నిషా ఎక్కించారు. జిల్లావ్యాప్తంగా రెండు నెలలపాటు సుమారు వంద కోట్ల మద్యం తాగేసినట్లు అంచనా.

ఓటర్లకి కిక్కే.. కిక్కు..

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నప్పటి నుంచి పోలింగ్ ముగిసే సమయానికి సుమారు రెండునెలల వ్యవధి ఉంది. ఈ నేపథ్యంలో బరిలో ఉంటామనుకున్న అభ్యర్థులు ప్రచారంలోకి వెళ్లారు. ఒక్కో పార్టీ ఒక్కో కార్యక్రమంతో ప్రచారం చేపట్టింది. అప్పటి నుంచే తమవెంట తిప్పుకునేందుకు మద్యం అందజేశారు. నామినేషన్ నుంచి పోలింగ్ రోజు వరకు రెట్టింపు స్థాయిలో ఓటర్లకు మద్యం అందించారు. ర్యాలీలు చేసినా, గ్రామాల్లో ప్రచారం నిర్వహించినా, రాష్ట్ర నేతలు ప్రచారాలకు వచ్చినా మద్యం అందించారు. ఎన్నడూలేనివిధంగా ఈసారి మద్యం అధికంగా విక్రయాలు సాగినట్లు సమాచారం. ఓటర్లను 56 రోజులపాటు ఆయాపార్టీల అభ్యర్థులు మద్యం, డబ్బులిస్తూ తిప్పుకున్నారు.

తెగ తాగేశారు..

నోటిఫికేషన్ వెలువడినప్పట్నుంచి ఈనెల 13 పోలింగ్‌రోజు వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో రూ.వందకోట్లకుపైగా విలువైన మద్యాన్ని ఓటర్లకు అందజేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. ప్రతి నియోజకవర్గం నుంచి ఆయాపార్టీల అభ్యర్థులు రూ.10కోట్లకుపైగా మద్యానికే ఖర్చు చేసినట్లు అంచనా. కొన్ని నియోజకవర్గాల్లో అన్ని పార్టీలు కలిసి రూ.15 కోట్లు మద్యానికే ఖర్చు చేసినట్లు లెక్కలు వేస్తున్నారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో కలిపి రూ.వందకోట్లకుపైగానే మద్యం తాగేసినట్లు అంచనా. ఏపీ మద్యం ఇంతపెద్దఎత్తున ఓటర్లకు ఇచ్చి ఉండుంటే రెండింతల బిల్లు అయిఉండేదని ఒక అధికార పార్టీకి చెందిన నాయకుడే చెప్పడం గమనార్హం. ఎందుకంటే కర్ణాటకలో మద్యం ధరలు తక్కువ. ఇక్కడైతే రెండింతలు అధికం. కర్ణాటక మద్యం వచ్చింది కాబట్టి, కొంత ఖర్చు తగ్గించుకోగలిగామని అభ్యర్థులు బహిరంగంగా చెప్పుకుంటున్నారు.

పోలింగ్‌రోజు ఏరులై పారింది..

ఈనెల 13న ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లావ్యాప్తంగా రూ.10కోట్లకు పైగా మద్యం సేవించినట్లు ఓ అంచనా. ప్రతి పంచాయతీకి రూ.లక్షకు తగ్గకుండా మద్యం అందించినట్లు సమాచారం. ఒక పార్టీనే ఇంత ఇచ్చి ఉండుంటే ఇక అన్ని పార్టీలు కలిసి ఏ స్థాయిలో సరఫరా చేశాయో అర్థం చేసుకోవచ్చు. ఈనెల 12, 13 తేదీల్లో కర్ణాటక సరిహద్దులో ఉన్న మద్యం షాపుల నుంచి భారీఎత్తున జిల్లాలోకి మద్యాన్ని తీసుకొచ్చారు. సరిహద్దుల్లో అన్నిచోట్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినా కొంతమంది అభ్యర్థులు ముందస్తుగానే ఆయా నియోజకవర్గాల్లో డంప్ చేసుకున్నారు. మరికొంతమందైతే కర్ణాటక వారికే డెలివరీ చేసే బాధ్యత అప్పగించారు. ఏదిఏమైనా ఏపీ ఎన్నికలు కర్ణాటక సరిహద్దులో ఉన్న మద్యం షాపులకు కాసుల వర్షం కురిపించిందనడంలో సందేహం లేదు.

నాణ్యమైన విత్తన కాయలను సరఫరా చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ



విత్తన వేరుశనగను పరిశీలిస్తున్న జేడీఏ

అనంతపురం అర్బన్, మే 20: రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలను సరఫరా చేయాలని జేడీఏ ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. ఏడీఏ రవి, ఏఓ శశికళతో కలిసి ఆమె అనంతపురంలోని హిమబిందు, కృష్ణ ట్రేడర్స్, విజయ ఆగ్రో ఏజెన్సీస్, నందీశ్వర ఏజెన్సీ, విజిట్ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లను సోమవారం తనిఖీ చేశారు. ప్రాసెసింగ్ తీరును, రికార్డులు, విత్తన మొలక శాతాన్ని పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ చేయాలని సూచించారు. ఆర్బీకేలకు కేవలం నాణ్యమైన విత్తన వేరుశనగ సరఫరా చేయాలని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

- జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో విత్తన వేరుశనగ కోసం రైతుల పేర్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియ సోమవారం రెండో రోజు కొనసాగింది. ఇప్పటిదాకా 10,205 మంది రైతులు 9,077 క్వింటాళ్ల కోసం పేర్లు నమోదు చేసుకున్నారు.

70శాతం సబ్సిడీతో పంపిణీ చేయాలి

గాండ్లపెంట, మే 20: ప్రభుత్వం ఖరీఫ్ సాగుకు సంబంధించి రైతులకు విత్తన వేరుశనగను 70శాతం సబ్సిడీతో పంపిణీ చేయాలని రైతు సంఘం నాయకులు ఖదర్‌వలి, రాజారెడ్డి, కొండారెడ్డి డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. గతేడాది తీవ్ర వర్షాభావం వల్ల రైతులు పంటల్ని పూర్తిగా నష్టపోయారన్నారు. కనీసం పశు గ్రాసం కూడా దక్కలేదని వాపోయారు. అయినా మండలానికి ఎలాంటి ఇన్‌పుట్ సబ్సిడీ, పంటనష్టపరిహారం ఇవ్వలేదన్నారు. దీంతో ఈయేడాది ఖరీఫ్‌లో పంటల సాగుకు, రుణాల రెన్యూవల్‌కు రైతుల వద్ద చిల్లిగవ్వ కూడా లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 40శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగను పంపిణీ చేయడానికి సంసిద్ధమైందని, కాగా డబ్బులు లేక రైతులు వాటి కొనుగోలుకు మొగ్గు చూపడంలేదని అన్నారు. వెంటనే ప్రభుత్వం 70శాతం సబ్సిడీతో విత్తన పంపిణీ చేయాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బత్తలపల్లి, మే20: మండలంలోని వెంకటగారిపల్లి గ్రామ శివారులో గల పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడులు చేశారు. అందులో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.20,150 నగదు, 3 బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ.. అందిన రహస్య సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లు వంటివి ఎవరైనా ఆడుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో బలిజపల్లివాసి మృతి

తిరుపతి(నేరవిభాగం), మే 20: తిరుపతి నగరంలోని లీలామహల్ సర్కిల్ వద్ద సోమవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. అలిపిరి ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లా ఓబుళదేవర చెరువు మండలం బలిజపల్లికి చెందిన కొట్టం నరసింహయ్య అనారోగ్యంతో రెండు రోజుల క్రితం తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి వచ్చాడు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో వైద్యం చేయించుకున్నాడు. అనంతరం తిరుమలకు వెళ్లి స్వామివారిని దర్శించుకున్నాడు. సోమవారం సాయంత్రం కిందకు వచ్చి లీలామహల్ వద్ద బస్సు దిగి రోడ్డు దాటుతుండగా బస్టాండు నుంచి నంద్యాలకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అలిపిరి పోలీసులు బస్సును సీజ్ చేసి, మృతదేహాన్ని రుయా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ కేసు నమోదు చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై మృతుడి బంధువులకు సమాచారం అందించారు.

కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన

అనంతపురం టౌన్, మే 20: జేఎన్‌టీయూలో ఈవీఎంల స్ట్రాంగ్‌రూములు, కౌంటింగ్ ఏర్పాట్లను కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్, నూతన ఎస్పీ గౌతమిశాలీ సోమవారం పరిశీలించారు. జూన్ 4న కౌంటింగ్ ఏఏ నియోజకవర్గానివి.. ఎక్కెడెక్కడ చేపడుతున్నారు.. అక్కడ ఏ విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.. తదితర వివరాలను కలెక్టరు ఎస్పీకి వివరించారు. కౌంటింగ్ రోజున ఆ ప్రాంతంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలు గురించి కలెక్టరు, ఎస్పీ ప్రత్యేకం గా చర్చించుకున్నారు. జేఎన్‌టీ యూ వద్ద మూడంచెల భద్రత పక్కాగా కొనసాగించాలని అధికారులను వారు ఆదేశం చారు. ప్రతి విషయంలోను ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని సూచించారు. కౌంటింగ్ ముగిసే వరకు అందరు బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. వారి వెంట నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, పలువురు ఆర్‌ఓలు, నోడల్ అధికారులు, డీఎస్పీలు పాల్గొన్నారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే!

- ఊపందుకున్న బెట్టింగ్‌లు

ఓబుళదేవరచెరువు, మే 20: సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన పార్టీల గెలుపుపై గ్రామాల్లో బెట్టింగ్‌ల జోరు ఊపందుకుంది. ఆయా పార్టీల నాయకులు తమ పార్టీదే గెలుపంటే.. కాదు తమ పార్టీదేనంటూ ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపుతో పాటు, మెజార్టీపైనా బెట్టింగ్‌లు జోరుగా వేస్తున్నట్లు తెలుస్తోంది. ఏ టీకొట్టులో, హోటళ్లలో చూసినా.. ఉదయం నుంచి సాయంత్రం వరకు బెట్టింగ్‌ల చర్చ కొనసాగుతున్నట్లు సమాచారం. మండలవ్యాప్తంగా 44 పోలింగ్ కేంద్రాల్లో 85.94 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 39,234 మంది ఓటర్లకుగాను 33,739మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి పోలింగ్ శాతం శాతం పెరిగింది. జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసవెళ్లిన వారు కూడా పెద్దఎత్తున తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. దీంతో పార్టీల గెలుపోటములపై ప్రతిచోటా నిత్యం చర్చ జరుగుతూనే ఉంది. వైసీపీ నాయకులు తమ పార్టీ అభ్యర్థికి 10వేల నుంచి 20వేల వరకు మెజార్టీ వస్తుందని చెబుతుండగా.. టీడీపీ వారు తమ ఎమ్మెల్యే అభ్యర్థి పదివేలనుంచి 20వేల మెజార్టీతో గెలవనున్నారని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఆ రోడ్లపై.. ప్రయాణించలేం..

- కంకర తేలి.. గుంతలు పడి దుస్థితిలో గ్రామీణ రోడ్లు
- ప్రయాణించాలంటే నరకం కనబడుతోందంటున్న గ్రామాల ప్రజలు

ఓబుళదేవరచెరువు, మే 20: మండలంలోని పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కంకర తేలి, గుంతలు పడి దుస్థితిలో ఉండడంతో వాటిపై ప్రయాణించాలంటే నరకం కనపడుతోందని ఆయాగ్రామాల ప్రజలు వాపోతున్నారు. గత ఐదేళ్లలో పాలకులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో రోడ్లకు ఈ గతి పట్టిందని అంటున్నారు. గత్యంతరం లేక ఈ రోడ్లలోనే అతికష్టం మీద ప్రయాణిస్తున్నామని అసహనం చెందుతున్నారు. ముఖ్యంగా ఓడీసీ నుంచి తుమ్మలకుంట్లపల్లికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. మధ్యలో నారప్పగారిపల్లి, వెంకటాపురం, బాగానిపల్లి, కరకమానుతోపు గ్రామాలు వస్తాయి. ఆయా గ్రామాల ప్రజలు నిత్యం ఏదో పనిమీద మండలకేంద్రానికి వస్తుంటారు. అయితే ఆ రోడ్డు దారి పొడవునా కంకర తేలి, మోకాలి లోతు గుంతలు పడి ఉన్నాయి. ద్విచక్రవాహనదారులు వాటిపై వెళ్లలేక అదుపుతప్పి తరచూ ప్రమాదాలకు గురువుతునారు. ఆ రోడ్డులో ప్రయాణం నరకంగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమవుతోందని, వర్షానికి రోడ్డు మరింత అధ్వానమయ్యే పరిస్థితి ఉందని చెబుతున్నారు. సమస్యను సంబంధితాధికారులకు, పాలకులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందంటున్నారు. ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. లేకపోతే ప్రమాదాలు పెరిగే అవకాశముందని వారు ఆవేదన చెందుతున్నారు.



ఓడీసీ-తుమ్మలకుంట్లపల్లి రోడ్డు దుస్థితి

అధికారులకు తెలిపినా ఫలితం శూన్యం



తమ గ్రామంలో రోడ్డు దుస్థితిపై పలుమార్లు సంబంధితాధికారులకు విన్నవించాం. సర్వసభ్యసమావేశంలో కూడా చర్చించాం. అయినా ఫలితం లేకపోయింది. రోడ్డు గుంతలమయం కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతు చేపట్టాలి.

- బీ. శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు, వెంకటాపురం

ప్రయాణం నరకంగా ఉంది..



గుంతల రోడ్డుపై ప్రయాణం భారమవుతోంది. గతంలో రహదారి బాగున్నప్పుడు ఇక్కడి నుంచి మండలకేంద్రానికి కేవలం పది నిముషాల్లో వెళ్లేవాళ్లం. ఇప్పుడు సుమారు అరగంటకు పైగా సమయం పడుతోంది. ఎగుడు దిగుడు గుంతలలో ప్రయాణం నరకంగా ఉంది.

- కుచ్చెపు అంజనేయులు, వెంకటాపురం

విత్తన వేరుశనగకు పేర్లు నమోదు చేయండి

- ఆర్బీకేల సిబ్బందికి వ్యవసాయాధికారుల సూచన

తనకల్లు, మే 20: మండలంలోని 14 రైతు భరోసా కేంద్రాల్లో విత్తన వేరుశనగ కావలసిన రైతులు పేర్లను నమోదు చేసుకోవాలని ఏఓ శ్రీహరినాయక్ సూచించారు. మండలకేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. రైతులు పేర్లు నమోదు చేయించడంతో పాటు డబ్బు కూడా చెల్లించి రసీదులు పొందాలని తెలిపారు. ప్రతి రోజు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో సంబంధిత విలేజీ అగ్రికల్చర్, సిరికల్చర్, ఉద్యానవ అసిస్టెంట్లు విత్తన పంపిణీ కోసం రైతుల పేర్లు నమోదు చేయనున్నట్లు చెప్పారు. కావలసిన రైతులు తమ పట్టాదారుపాసుపుస్తకం, ఆధార్, సెల్ తీసుకెళ్లి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎక్కడైనా రైతుల పేర్లనమోదు, నగదు చెల్లింపులో సమస్య ఉంటే వెంటనే 8500942088కు సంప్రదించాలని సూచించారు.

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా రైతులు విత్తన వేరుశనగ కావాల్సిన రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రియ ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసే రైతులకు ప్రభుత్వం 40శాతం సబ్సిడీతో విత్తన కాయల్ని అందిస్తోందన్నారు. కావాల్సిన వారు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, సెల్ నంబర్లతో ఆర్బీకేలకు వచ్చి డబ్బు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నల్లమాడ/నల్లచెరువు: మండలవ్యాప్తంగా సబ్సిడీ విత్తన వేరుశనగ కావాల్సిన రైతులు ఆయా ఆర్బీకేలలో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ సుమతి ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచే నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, ఫోన్‌నంబర్‌తో వచ్చి డబ్బు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే నల్లచెరువు మండలవ్యాప్తంగా రైతులు సబ్సిడీ విత్తనవేరుశనగ కోసం ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని ఏఓ భారతి తెలిపారు.

ఆర్బీకేల సిబ్బందితో సమావేశం

నంబులపూలకుంట, మే 20: మండలకేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఏఓ లోకేశ్వర్‌రెడ్డి మండలంలోని రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా అన్ని ఆర్బీకేలలో ఈనెల 29నుంచి సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలకు రైతుల పేర్లు నమోదు చేయాలన్నారు. 40శాతం సబ్సిడీతో వాటిని విక్రయిస్తామన్నారు. కావాల్సిన రైతులు ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం, ఫోన్ నంబర్ తీసుకొచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. రైతులు ఇప్పటికే వర్షాలు కురవడంతో లోతు దుక్కిలు చేసుకున్నారన్నారు. ఆర్బీకేలకు ఈనెల చివరి నాటికి ఎరువులు అందుబాటులో ఉంటాయన్నారు. ఆర్బీకే సిబ్బంది అందుబాటులో ఉండి రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలు అందించాలని సూచించారు. మండల వ్యాప్తంగా 3,349మంది రైతులకు ప్రభుత్వం 4.26 కోట్ల రూపాయల ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్మును వారి వారి ఖాతాల్లోకి జమ చేసిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సమావేశంలో ఆర్బీకేల సిబ్బంది, ఏఈఓ తదితరులు ఉన్నారు.

'ఇన్‌పుట్ సబ్సిడీ జమకాలేదు'

నంబులపూలకుంట: మండలంలోని పీ కొత్తపల్లిలో పలువురు రైతులు తమ ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్ము జమకాలేదని సోమవారం ఆర్బీకే వద్ద కు సిబ్బందిని ప్రశ్నించడానికి వెళ్లారు. ఆర్బీకే సిబ్బంది లేకపోవడంతో అసహనంతో వెనుదిరిగారు. పంటలు సాగుచేసినా తమకు ఇన్‌పుట్ సబ్సిడీ జమకాలేదని ఆవేదన చెందారు. ఫోన్‌ద్వారా ఏఓ లోకేశ్వర్‌రెడ్డిని సంప్రదించగా.. రైతుల జాబితా తమ వద్ద ఉందని, సాగుచేసిన ప్రతి రైతు జాబితా ఉన్నతాధికారులకు పంపామని ఆయన తెలిపారు. జాబితాలో ఉన్నవారందరికీ జమ అవుతున్నట్లు చెప్పారు. అందరికీ జమ అవుతాయని పేర్కొన్నారు.

ఆర్బీకేలకు చేరిన విత్తన వేరుశనగ

ఓబుళదేవరచెరువు, మే 20: సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు మండలంలోని వివిధ ఆర్బీకేలకు సోమవారం చేరాయి. మండల వ్యాప్తంగా 4,700 క్వింటాళ్లు అవసరముండగా, సోమవారం నాటికి 14వందల క్వింటాళ్ల కే-6 రకం కాయలు వివిధ ఆర్బీలకు వచ్చినట్లు ఏఓ ఇలియాజ్ అహమ్మద్ తెలిపారు. ఆర్బీకేల్లో రైతుల పేర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. కాయల పంపిణీ తేదీలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.



ఓడీసీలోని ఆర్బీకేకు చేరిన విత్తన వేరుశనగ

6వరకు సెక్షన్ 30 యాక్టు అమలు

కదిరిఅర్బన్, మే 20: కదిరి సబ్‌డివిజన్‌లోని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్టు అమలులో ఉందని డీఎస్పీ శ్రీలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనుక ప్రజలు, రాజకీయపార్టీలు, సంఘాలు ముందస్తు అనుమతి లేనిదే సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ఎవరైనా ప్రవర్తిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూన్ 6వ తేదీ వరకు యాక్టు అమలులో ఉంటుందని, ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

సభలు, సమావేశాలు నిర్వహించకూడదు: ఎస్ఐ

నంబులపూలకుంట, మే 20: మండలంలో రాజకీయ, రాజకీయేతర పార్టీలకు సంబంధించిన వారు అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ధర్నాలు నిర్వహించకూడదని ఎస్ఐ శ్రీధర్ సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కదిరి సబ్‌డివిజన్ పరిధిలో యాక్టు 30 అమలులో ఉందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ఎవరూ పాల్పకూడదన్నారు. ఎవరైనా పాల్పడితే చట్టరీత్యా చర్యలుంటాయని హెచ్చరించారు.

నాటుసారా పట్టివేత

నంబులపూలకుంట, మే 20: మండలంలోని నల్లగుట్టపల్లి తండాలో 32 లీటర్లు నాటుసారాను పట్టుకుని వాటిని విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. తనిఖీల్లో భాగంగా సోమవారం నాటుసారా కేంద్రాలపై దాడులు చేసి ఈ అరెస్టు చేశామన్నారు. అనంతరం దుకాణాలను కూడా తనిఖీ చేశామన్నారు. తర్వాత పెడబల్లి, కొత్తపల్లి గ్రామాల్లో పర్యటించి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని ప్రజలకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఆయనవెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

పుట్టపర్తి మే 20: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌సీ నాగేశ్ సూచించారు. మండలంలోని కోట్లపల్లి, రాచువారిపల్లి గ్రామాల్లో ప్రజలకు సోమవారం ఆయన సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే క్షయ నివారణకు అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని తెలిపారు. ఈ వ్యాక్సిన్ వేయించుకుంటే క్షయ పూర్తిగా నయమవుతుందని చెప్పారు. ముఖ్యంగా క్షయ వచ్చి తగ్గిపోయిన వారు, అరవై ఏళ్ల వయసు నిండిన వారు ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటరమణ, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పొదుపు సంఘాల పనితీరుపై సమీక్ష

బత్తలపల్లి, మే20: మండలకేంద్రంలోని స్త్రీశక్తి భవన్‌లో సోమవారం బత్తలపల్లి, గాండ్లపెంట, ఓబుళదేవరచెరువు, ముదిగుబ్బ, చెన్నేకొత్తపల్లి మండలాల వెలుగు సిబ్బందితో వెలుగు పీడీ నరసయ్య సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాల పనితీరు మెరుగు పరుచుకోవాల ని సిబ్బందికి సూచించారు. రుణాల రికవరీ పెంచాలన్నారు. ముదిగుబ్బ మండల సి బ్బంది అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని, మెరుగుపడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్లు రామ్మోహన్, రామిరెడ్డి, రమణప్ప, రామేశ్వరరెడ్డి, ఏపీఎం సుదర్శన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ నరసయ్య

సర్వసభ్య సమావేశం వాయిదా

నల్లచెరువు, మే 20: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశంజరగాల్సి ఉండగా.. కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీఓ ఎం.రాణెమ్మ తెలిపారు. సర్వసభ్య సమావేశానికి అధికారులు మాత్రమే హాజరయ్యారన్నారు. ప్రజాప్రతినిధులు రాకపోవడంతో కోరం లేక సమావేశం వాయిదా వేసినట్లు చెప్పారు. తదుపరి నిర్వహించే తేదీని ప్రకటిస్తామన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

నల్లచెరువు, మే 20: మండలంలోని ఓగ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఆమె తండ్రి ఫిర్యాదు చేశారని ఎస్ఐ కేఎం లింగన్న సోమవారం తెలిపారు. యువతి ఈనెల 17వతేదీన రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిపై నిద్రించిందని, అయితే కొద్దిసేపటికి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందని తెలిపారు. బంధువులు, స్నేహితులను విచారించినా, ఆచూకీ తెలియలేదని, ఈ మేరకు తండ్రి ఫిర్యాదు చేయడంతో .. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

కత్తివారిపల్లిలో పోలీసుల తనిఖీ

గాండ్లపెంట, మే 20: మండలంలోని సోమయాజపల్లి పంచాయతీ కత్తివారిపల్లి గ్రామంలో పోలీసులు సోమవారం ఎస్ఐ కృష్ణవేణి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానిత ప్రదేశాల్లో తనిఖీ చేశారు. తర్వాత ఎస్ఐ గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎవరూ కూడా గ్రామాల్లో ఘర్షణకు దిగకూడదన్నారు. కార్యక్రమంలో జమేదార్ రామయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



కత్తివారిపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణవేణి

మరవతండాలో..

కదిరిఅర్బన్: మండలంలోని మరవతండాలో సోమవారం రూరల్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. సీఐ మోహన్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేశారు. అనంతరం సారా విక్రేతలను గురించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తర్వాత ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరాల నియంత్రణకే ఈ తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. ఏఎస్ఐ రామక్రిష్ణ, సిబ్బంది గంగాధర్, రవి తదితరులు ఉన్నారు.



మరవతండాలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ మోహన్

ఓటీఎస్‌పై దృష్టి సారించండి

ఓబుళదేవరచెరువు, మే20: ప్రభుత్వ పక్కాఇళ్ల లబ్ధిదారుల వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌పై (ఓటీఎస్) సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీఓ వరలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ జాకీర్ హుస్సేన్ సూచించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం వారు సచివాలయ సిబ్బంది, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గతంలో.. ఓటీఎస్ పొందని లబ్ధిదారులు ఎంతమంది ఉన్నారన్న వివరాలను సచివాలయం వారీగా సేకరించి మంగళవారం లోపు అందజేయాలన్నారు. ప్రైవేటు స్థలాలో గృహాలు నిర్మించిన వారి జాబితాను కూడా తయారు చేయాలని, వాటిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. సమావేశంలో ఈఓఆర్డీ రాజశేఖర్, గృహనిర్మాణ శాఖ ఏఈ నాగభూషణం, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వరలక్ష్మి

సచివాలయాల్లో కనిపించని సిబ్బంది

- ఎన్‌పీకుంట 2వ సచివాలయంలో సమయపాలన పాటించని వైనం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

నంబులపూలకుంట, మే 20: గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలందించడానికి గాను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా గ్రామ పంచాయతీలలో సచివాలయాలు ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో మండలకేంద్రంలో 1వ, 2వ సచివాలయాలు ఉన్నాయి. అయితే 2వ సచివాలయంలో సిబ్బంది బాధ్యతారాహిత్యంగా ఉంటూ సమయ పాలన పాటించడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ సచివాలయానికి సోమవారం కూడా సమయానికే తలుపులు తెరిచారు. అయితే సిబ్బంది మాత్రం వేళకు రాలేదు. దీంతో అక్కడ ఉన్న కుర్చీలన్నీ దర్శనమిచ్చాయి. సచివాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు సిబ్బంది లేకపోవడం చూసి నిరాశతో వెనుదిరిగి వెళ్లారు. ఈ విషయాన్ని కొందరు సర్పంచ్ అంజనమ్మ దృష్టికి తీసుకెళ్లారు. సచివాలయానికి సమయానికి హాజరుకావాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని పలుమార్లు సూచించామని, అయినా సిబ్బంది పనితీరులో మార్పురాలేదని ఆమె వాపోయారు. మండలాధికారులకు ఫిర్యాదు చేసినా, ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని, సచివాలయాల్లో సిబ్బంది సమయానికి వచ్చి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



సచివాలయం 2లో సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

మినరల్ వాటర్ ప్లాంట్ మూత

- రెండేళ్లుగా ప్రజలకు అందని శుద్ధ జలం
- పట్టించుకోని అధికారులు

నల్లమాడ, మే 20: మండలకేంద్రంలోని మినరల్ వాటర్ ప్లాంట్ ఉన్నట్టుండి మూతపడింది. దీంతో శుద్ధజలం అందక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్లాంటును 2016లో ఎన్టీఆర్ సుజల స్రవంతి కింద రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు(ఆర్డీటీ) వారు పంచాయతీ అనుసంధానంతో ఏర్పాటు చేసి ప్రారంభించారు. ప్రజలకు మినరల్ వాటర్‌ను ఈ ప్లాంట్ ద్వారా కొన్నేళ్ల పాటు అందించారు. 15 లీటర్ల నీటిని రూ.5కే విక్రయించే వారు. మండకేంద్రంలోని ప్రజలందరికీ ఆ నీరు అందేది. రెండేళ్ల నుంచి ఆ ప్లాంట్ మూతపడింది. మినరల్ వాటర్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ప్లాంట్ వినియోగంలో లేకపోవడంతో అందులోని యంత్రాలు తుప్పు పట్టి పాడై ఉంటాయని వాపోతున్నారు. అర్థాంతరంగా ప్లాంటును ఎందుకు మూసివేశారో అర్థం కావడం లేదని అంటున్నారు. ఇన్ని రోజులైనా అధికారులు కూడా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా స్పందించి ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకొచ్చి మినిరల్ వాటర్‌ను అందించాలని వారు కోరుతున్నారు.



మూతపడిన మినరల్ వాటర్‌ప్లాంట్

అక్కదేవతలకు ప్రత్యేక పూజలు

ఓబుళదేవరచెరువు, మే 20: మండలంలోని దాదారెడ్డిపల్లి గ్రామ సమీపంలో వెలసిన అక్కదేవతల ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. తొలుత పూజారి వెంకటేష్ అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వివిధ పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నదానం జరిగింది.



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా చౌడేశ్వరీ దేవి జాతర

లేపాక్షి, మే 20: మండలంలోని సడ్లపల్లి గ్రామంలో చౌడేశ్వరీదేవి జాతరను మూడు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. హిందూపురం మండలం కొటిపి గ్రామంలో వెలసిన చౌడేశ్వరీదేవిని పి. సడ్లపల్లి గ్రామస్థులు ఊరేగింపుగా గ్రామానికి తీసుకొచ్చారు. అమ్మవారికి గంగపూజ నిర్వహించారు. మంగళ, బుధవారాల్లో అమ్మవారిని ఇంటింటికి ఊరేగిస్తారన్నారు. మహిళలు శుక్రవారం దీపాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.



సడ్లపల్లికి చేరిన చౌడేశ్వరీదేవి ఉత్సవ విగ్రహం

23న వేంకటేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం


అలంకరణలో వేంకటేశ్వరస్వామి

మడకశిర టౌన్, మే 20: పట్టణంలోని కోట వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 23వ తేదీన స్వామివారి బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం స్వామివారికి విశేష అలంకరణ, ఉదయం తిరుమంజనం, అంకురార్పణం, 21న ధ్వజారోహణ, యాగశాల ప్రవేశం, కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ఠాపన, శ్రీవారికి అభిషేకాలు, 22న శ్రీవారి కల్యాణోత్సవం, నిత్య హోమాలు, 23వతేదీన స్వామివారి బ్రహ్మరథోత్సవం, 24వతేదీన పార్వేట ఉత్సవం, కలశారాధన, నిత్యహోమం, 25న వసంతోత్సవం, పూర్ణాహుతి, శ్రీవారి శయనోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

23న ఆంజనేయస్వామి రథోత్సవం

హిందూపురం, మే 20: హిందూపురం మండలం సంతేబిదునూరులో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మరథోత్సవం 23న నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. మంగళవారం రాత్రి సీతారాముల కల్యాణం, 22న గజేంద్ర మోక్ష ఉత్సవాలు, 23న బ్రహ్మ రథోత్సవం, తెల్లవారుజామున దీపోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నరసింహమూర్తి తెలిపారు. 24న అశ్వ వాహనోత్సవం, 25న వ సంతోత్సవం, శయనోత్సవంతో బ్రహ్మరథోత్సవం ముగుస్తాయన్నారు.

నేడు విద్యానగర్‌లో 10వ వార్షికోత్సవం : పట్టణంలోని విద్యానగర్‌లో వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో 10వ వార్షికోత్సవ వేడుకలు జరుగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం సాయంత్రం మూల దేవత ప్రార్థనతో ప్రారంభమై పుణ్యావచనం, రక్షాబంధన, కళశస్థాపన, మహా మంగళహారతితో ముగియనుంది. అదేవిధంగా మంగళవారం కళశార్చన, అగ్ని ప్రతిష్టాపనతో ప్రారంభమై సాయంత్రం లక్ష్మీ వెంకటేశ్వరస్వామి నగరోత్సవంతో ముగియనుంది. మధ్యాహ్నం కళ్యాణోత్సవ కార్యక్రమాలు జరుగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి జాతర


సడ్లపల్లికి చేరిన చౌడేశ్వరీదేవి ఉత్సవ విగ్రహం

లేపాక్షి, మే 20: మండలంలోని సడ్లపల్లి గ్రామంలో చౌడేశ్వరీదేవి జాతర కార్యక్రమాన్ని మూడురోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. హిందూపురం మండలం కొటిపి గ్రామంలో వెలసిన చౌడేశ్వరీదేవిని పి. సడ్లపల్లి గ్రామస్థులు ఊరేగింపుగా గ్రామానికి తీసుకొచ్చారు. అమ్మవారికి గంగ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళ, బుధవారం అమ్మవారిని ఇంటింటికి ఊరేగిస్తారన్నారు. మహిళలు శుక్రవారం దీపాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

పురంలో కార్డెన్ సెర్చ్


అంబేడ్కర్ నగర్‌లో సోదాలు చేస్తున్న పోలీసులు

హిందూపురం, మే 20: పోలింగ్‌కు ముందు తరువాత జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని హిందూపురంలో కూడా పోలీసులు అలర్ట్ అయ్యారు. సోమవారం పట్టణంలో పలుచోట్ల వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు, టూటౌన్ సీఐ రియాజ్ అహ్మద్‌లు కలిసి సిబ్బందితో వెళ్లి సోదాలు చేశారు. అనుమానాలున్న వ్యక్తులపై ఆరాతీశారు. ఇళ్లలో మారణాయుధాలుకానీ, నేరాలకు ఉపయోగించే వస్తువులు ఉంటే వాటిని స్వాధీనం చేసుకున్నారు. సీఐలు మాట్లాడుతూ కౌంటింగ్ ముగిసినా కేంద్ర బృందాలు అందుబాటులో ఉంటాయని, దీనివల్ల ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు, రాజకీయంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ ముగిసేవరకే రాజకీయాలు ఆతరువాత ఎవరి పని వారు చేసుకొని పోవాలన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయండి


ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న పాలసముద్రం వాసులు

గోరంట్ల, మే 20: వీధిదీపాలు ఏర్పాటుచేయాలని మండలంలోని పాలసముద్రం జాతీయ రహదారి కూడలిలో నివాసముంటున్న ప్రజలు సోమవారం అధికారులకు విజ్ఞప్తి చేశారు. పాలసముద్రం కూడలిలో ప్రభుత్వ స్థలంలో వందమంది నివాసాలు ఏర్పాటుచేసుకుని జీవనం సాగిస్తున్నారు. గుట్ట ప్రాంతం కావడంతో తరచూ విషకీటకాలు సంచరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పెద్దన్న ఆధ్వర్యంలో వారు గోరంట్లలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ సూర్యనారాయణ, ఈఓఆర్డీ సుధాకర్‌లకు వినతిపత్రాలు అందించారు. విద్యుత్ శాఖాధికారులకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని తెలిపినా పట్టించుకోలేదన్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులుండడంతో ప్రస్తుతమున్న విద్యుత్ స్తంభాలకు వీధిదీపాలు ఏర్పాటు చేయాలన్నారు. సీపీఎం నాగభషణ, ఇళ్లస్థలాల పోరాట కమిటీ నాయకులు వెంకటలక్ష్మమ్మ, నంజుడప్ప, ఆంజనేయులు, అశ్వర్థమ్మ, లక్ష్మీదేవి, అచ్చమ్మ, గంగమ్మ, వడ్డి రామలక్ష్మమ్మ, బాబా, బాషా, లోకేష్ పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

హిందూపురం, మే 20: పదోతరగతి పాసైన విద్యార్థులు ఐటీఐకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాయపరెడ్డి కోరారు. లేపాక్షి మండలం కంచిసముద్రం వద్ద ఉన్న ప్రభుత్వ పారిశ్రామిక (ఐటీఐ)లో చేరే విద్యార్థులు వచ్చేనెల 10లోపు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, ఐటీఐలో అందజేయాలన్నారు. దరఖాస్తు వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులు మాత్రమే కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చన్నారు.

దేశానికి రెండో సూర్యుడు అంబేడ్కర్

పావగడ, మే 20: పొద్దున ఉదయించి సాయంత్రం అస్తమించే సూర్యుడు ప్రపంచానికి వెలుగునిస్తే, భారతదేశానికి రాత్రింపగళ్లు వెలుగునిచ్చి జీవితాన్ని దారబోసిన మహనాయుడు డాక్టర్ బీర్ అంబేడ్కర్ అని భారతీయ పరివర్తన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది హరిరాం అన్నారు. సోమవారం ఇంద్రమిట్ట గ్రామంలో అంబేద్కర్ 133వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆకలి అవమానాలను అధిగమించి పేదలకు కొండంత అండగా నిలిచిన రాజ్యాంగ సృష్టి కర్త అంబేడ్కర్ జీవిత ఆశయాలను ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని బెంగళూరు సెయింట్ జోసఫ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రేమజ్యోతి తెలిపారు. తమ పిల్లలు విద్యావంతులుగా ఎదిగినప్పుడే వారి బంగారుభవితకు బాట వేసినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో బెంగళూరు మహారాణి కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ గోవిందరాజు, సుబ్బరాజు, భారతీయ పరివర్తన సంఘం తుమకూరు అధ్యక్షుడు కెంచరాయ, దళిత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


హరిరామ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఖాతాలో జమకాని పంటనష్ట పరిహారం..!

- పంటల సాగు ప్రశ్నార్థకం
- పరిహారం కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ
- చేతిలో చిల్లిగవ్వ లేదు... పంటల సాగు ఎలా?
- ఆవేదనలో అన్నదాతలు..

మడకశిర, మే 20: రైతుల ఖాతాల్లో నేటికీ కొందరు రైతుల ఖాతాల్లో పంటనష్టపరిహారం జమ కాలేదు. ఓ వైపు ఈ ఖరీఫ్‌లో ముందస్తు వర్షాలు కురుస్తున్నాయి. చేతిలో చిల్లిగవ్వ లేక పంట సాగుకు పొలాలను సిద్ధం చేసుకోలేకపోతున్నామని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది దెబ్బతిన్న పంటలకు పంట నష్టపరిహారం అందిస్తామని ప్రభుత్వం చెప్పినా ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నా రైతుల ఖాతాలలోకి పంటనష్ట పరిహారం కొంత మందికి జమ అవుతున్నా, మరికొంత మందికి జమ కావడం లేదు. దీంతో పంటనష్ట పరిహారం జమ కాని రైతులు బ్యాంకులు, అధికారుల చుట్టు తిరుగుతున్నారు. గత సంవత్సరం అధిక వడ్డీకి అప్పులు తెచ్చి పంటలు సాగుచేశారు. తీవ్ర వర్షాభావంతో పంటలు దెబ్బతిని పూర్తిగా నష్టపోయి అప్పులపాలు అయ్యామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో తిరిగి పంటలు సాగు చేసేందుకు అప్పులు పుట్టడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ప్రతి ఏడాదీ రైతులు ఖరీఫ్‌లో 40 వేల హెక్టార్లు దాకా పంటలు సాగు చేస్తున్నారు. వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని ప్రతి ఏడాదీ నష్టపోతూనే ఉన్నారు. మరో పక్క పంటల సాగు విస్తీర్ణం కూడా తగ్గిపోతోంది. ఎకరా వేరుశనగ సాగు చేయాలంటే రూ.20వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంది. ప్రతి ఏడాది ఏదో విధంగా పంటలు దెబ్బతినడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.


వర్షాలు పడుతున్నా మొదలు కాని పొలం పనులు

బటన్ నొక్కినా జమకాని సొమ్ము

గత ఏడాది ఖరీఫ్‌లో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మార్చి 6న బటన్ నొక్కాడు.

ఇన్‌పుట్ సబ్సిడీ జమ కాలేదు..



తనకు 3.5 ఎకరాల పోలం ఉంది. ప్రతి ఏడు అప్పులు చేసి వేరుశనగ పంట సాగు చేశా. అతివృష్టి అనావృష్టి కారణంగా పంటలు దెబ్బతిని పూర్తిగా నష్టపోతున్నాం. వర్షాభావం కారణంగా వేరుశనగ పంట దెబ్బతిని నష్ట పోయాం. ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేసింది. అయితే నేటికీ ఖాతాలోకి నగదు జమ కాలేదు. వేలాది రూపాయాలు పంట సాగుకు పెట్టుబడి పెట్టి నష్టపోయా. కనీసం గ్రాసం కూడా దక్కలేదు. ప్రభుత్వం స్పందించి పంటనష్ట పరిహారం అందించాలి.

- శాంతకుమార్, ముక్కడంపల్లి, అగళి మండలం

దెబ్బతిన్న పంటలు, మంజూరైన ఇన్‌పుట్ సబ్సిడీ ఇలా...

మండలం	రైతులు	దెబ్బతిన్న పంటలు (హెక్టార్లు)	ఇన్‌పుట్‌సబ్సిడీ మంజూరు రూ.లక్షల్లో
అగళి	9,023	3,331.40	433.52
అమరాపురం	7,066	3,732.83	584.59
గుడిబండ	1,184	4,447.35	655.35
మడకశిర	9,145	4,069.60	575.61
రొళ్ల	10,787	4,114.01	613.27
మొత్తం	47,505	19,695.18	2,862.32

అయితే ఈ నిధులను పోలింగ్ పూర్తయిన వెంటనే వారి ఖతాలలోకి జమ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికలు ముగిసి 7 రోజులు అవుతున్నా నేటికి కొంతమంది రైతుల ఖతాల్లోకి పంటనష్ట పరిహారం జమకాలేదు. దీంతో రైతులు బ్యాంకులు, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మడకశిర నియోజకవర్గంలోని ఐదుమండలాల్లో గత ఖరీఫ్‌లో 19,695 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. 47,505 మంది రైతులకు రూ.28.62 కోట్ల పంటనష్ట పరిహారం మంజూరైంది.

కౌలుకు పంట సాగు చేశా



సొంత భూమి లేక కౌలుకు తీసుకుని వేరుశనగ పంటను సాగు చేశా. రెండు ఎకారలకు రూ.40 వేల దాకా ఖర్చు చేశా. తీవ్ర వర్షాభావంతో ఆ పంట కాస్త ఎండిపోయింది. పంటను మధ్యలోనే తొలగించా. పెట్టుబడి మొత్తం పోయింది. పంట నష్ట పరిహారం నేటికీ అందలేదు. ఈ ఏడు పెట్టుబడికి చేతిలో చిల్లిగవ్వ లేక వేరుశనగకు బదులు ఉలువులు వేస్తున్నా.

- రైతు అస్లామ్‌బాషా

ప్రజాసేవ చేసేందుకు ముందుంటా

- టీడీపీ నాయకుడు నాగరాజు


నాగరాజును సత్కరిస్తున్న ఆనంద్, అశ్వత్థరెడ్డి తదితరులు

హిందూపురం, మే 20: ప్రజాసేవ చేయడానికి ఎప్పుడూ ముందుంటానని టీడీపీ సీనియర్ నాయకుడు నాగరాజు అన్నారు. సోమవారం నాగరాజు జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ రావిళ్ల లక్ష్మీనాగరాజును సత్కరించారు. నాగరాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ మా కుటుంబానికి పెద్దపీట వేసిందన్నారు. పార్టీతోపాటు నాయకులు కార్యకర్తల రుణం ఈ జన్మలో తీర్చుకోలేనన్నారు. వారికోసం జీవితాంతం పనిచేస్తానన్నారు. ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానంటే పార్టీ, కార్యకర్తలే కారణమన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహాయ సహకారాలతో పార్టీకి, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. నాగరాజుకు ఎమ్మెల్యే బాలకృష్ణ దంపతులు శుభాకాంక్షలు తెలిపారు. కేక్‌కట్‌చేసి మిఠాయిలు పంచారు. టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్, మంగేష్, ఖలీల్‌ఖాన్, బాబురెడ్డి, రఫీక్, లింగారెడ్డి, లక్ష్మీదేవమ్మ, రమేష్, షెక్షావలి, చలపతి, అచ్యుత్ ప్రసాద్, రాజేష్, వినిత్, టైలర్ గంగాధర్, మహేష్, అంజాద్, అంజి, ఖాన్, అన్సర్, విజయలక్ష్మి, ఉమాశంకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ అశ్వత్థ నారాయణరెడ్డి, జయప్ప, రంగారెడ్డి, ప్రవీణ్, భార్గవ్ పాల్గొన్నారు.


నాగరాజును సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

దుకాణంలో దోపిడీ

- పెరుగుతున్న నిత్యావసర ధరలు
- సామాన్యుల నడ్డివిరుస్తున్న దుకాణదారులు
- పట్టించుకోని వాణిజ్య పన్నుల శాఖాధికారులు


చిలమత్తూరు, మే 20: నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. మార్కెట్‌లో పెరగడం ఒకటైతే.. దానికి తోడుగా దుకాణాల్లో అనధికార పెంపుతో పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచేలా ఉంది. వీటిని అదుపు చేయాల్సిన వాణిజ్య పన్నుల శాఖాధికారులు మామూళ్లకు అలవాటుపడి మిన్నకుండిపోతున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు నిత్యావసర వస్తువుల ధరలను అనధికారికంగా పెంచేశారు. చిలమత్తూరు మండల కేంద్రానికి సుమారు 84 గ్రామాల ప్రజలు వచ్చి నిత్యావసన వస్తువులను కొనుగోలు చేస్తుంటారు. ఆయా గ్రామాల పరిధిలో పెద్ద పెద్ద దుకాణాలే వెలిశాయి. అయితే మార్కెట్లో ఉన్న ధరల కంటే ఎక్కువ ధరలకు సరుకులను విక్రయిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మా దుకాణాల్లో ధరలు ఇలాగే ఉంటాయి, నీకు ఇష్టం ఉంటే కొను, లేకుంటే వెళ్లు అంటూ ఘాటుగా సమాధానం ఇస్తున్నారు. వ్యాపారులు. అంతేకాకుండా దుకాణాల్లో కొనగోలు చేసిన సరుకులకు చెత్త కాగితంపై బిల్లులు ఇస్తున్నారు. అదీకూడా వారికి ఇష్టమొచ్చిన విధంగా ధరలు వేసి ఇస్తున్నారు. ఇలా గ్రామాల్లో సైతం సామాన్య ప్రజల నుంచి దోపిడీకి పాల్పడుతున్నారు. అసలే కష్టకాలంలో ఉన్న ప్రజలకు దుకాణాల్లో జరుగుతున్న దోపిడీ ఇంతా అంతా కాదన్నట్లుగా ఉంది.

యథేచ్ఛగా కల్తీ సరుకుల విక్రయాలు

దుకాణాల్లో సరుకుల కల్తీ కూడా యథేచ్ఛగా జరుగుతున్నాయన్న విమర్శలున్నాయి. కల్తీ సరుకులను సైతం అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా ఇష్టానుసారంగా ఎక్కువ ధరలకు సరుకులను విక్రయిస్తున్నా వాటిని నియంత్రించాల్సిన వాణిజ్య పన్నుల శాఖాధికారులు మిన్నకుండిపోతుండటంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల తనిఖీలు లేకపోవడంతో దుకాణాదారుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. ప్రధానంగా వాణిజ్య శాఖా అధికారులకు నెల మామూళ్లు అందుతుండటంతోనే దుకాణా దారులపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో మార్కెట్ ధరలకు తిలోదకాలు ఇస్తూ వారికి ఇష్టమైన ధరలను సామాన్య ప్రజలపై రుద్దుతున్నారు.

దుకాణాల్లో ధరలు ఇలా ఉన్నాయి...

వేరుశనగ నూనె కిలో రూ.150, ఫార్చ్యూన్ ఎస్.ఎఫ్ ఆయిల్ కిలో రూ.110, కందిపప్పు కిలో రూ.150, మినుముపప్పు రూ. 120, బెల్లం రూ.55, ఎండు మిరప రూ. 200, శనగపప్పు రూ.80, ఉల్లిగడ్డలు రూ.30, వెల్లుల్లి రూ.150, చక్కెర రూ.45, మైదా, ఆటా, గోధమ పిండి వంటివి రూ.50గా ఉన్నాయి. ఇక బియ్యం విషయానికి వస్తే మార్కెట్లో బియ్యం ధరలు పేద ప్రజలకు అందుబాటులో ఉన్నా.. చిల్లర దుకాణాల్లో తగ్గేదేలా అన్నట్లు ఉంటుంది. 25 కిలోల లోకల్ మసూరి బియ్యం ప్యాకెట్ రూ.1350 నుంచి రూ.1575 వరకు ఉంది. సన్న బియ్యమే కావాలంటే రూ.1800 నుంచి రూ.2200 పెట్టుకోవాల్సిందే. నిత్యాసర సరుకుల ధరలు పెరిగాయన్న సాకును చూపించి సామాన్య, మధ్యతరగతి ప్రజల కడుపులను కొడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి ఇష్టానుసారంగా ధరలను పెంచి సరుకులను విక్రయిస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకొని సామాన్య ప్రజలకు అందుబాటులో నిత్యావసర సరుకుల ధరలు ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు.


ఓ దుకాణంలో చిత్తు కాగితంపై ఇచ్చిన బిల్లు

వ్యవసాయాధికారులు ఎక్కడ?

- తెరుచుకోని వ్యవసాయశాఖ కార్యాలయాలు
- వర్షం వచ్చినా కానరాని సిబ్బంది
- జాడలేని ఎంపీఈఓలు, ఏఈఓలు

అగళి, మే 20: మండల కేంద్రంలో వ్యవసాయ అధికారులు కనిపించడం లేదు. ఓ వర్షాలు కరుస్తున్నాయి. రైతులు విత్తనం వేసేందుకు భూములను దుక్కిదున్ని సిద్ధం చేస్తున్నారు. వ్యవసాయంలో సూచనలు సలహాలు ఇచ్చేందుకు వ్యవసాయాధికారులు కార్యాలయానికి రావడం లేదు. దీంతో రైతులు ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. మండలం కర్ణాటక సరిహద్దుకు ఆనుకుని ఉంది. ఈ మండలానికి అధికారులు రావాలన్నా, పోవాలన్నా ఇబ్బందిగా ఉన్న నేపథ్యంలో సుదూర ప్రాంతాల నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చి ఉద్యోగం చేయడం కష్టంగా మారింది. ఇక్కడ ఉద్యోగంలో చేరినా కొన్నాళ్లకే బదిలీ చేయించుకుని వెళ్లిపోతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు కార్యాలయాల్లో ఉండడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది వర్షాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రస్తుతం వర్షాలు పడి వ్యవసాయశాఖ అధికారులు అందుబాటులో లేరని రైతులు చర్చించుకుంటున్నారు. రైతులకు పంటల సాగుకు సలహాలు సూచనలు ఇచ్చేవారే కరువయ్యారన్నారు. ప్రస్తుతం వర్షాలు అధికంగా కురుస్తుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే ఇక్కడ వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండటం లేదు. వేరుశనగ కాయలు కావాలన్నా ప్రత్యామ్నాయంగా రాగి, కంది, మొక్కజొన్న తదితర విత్తనాలు, ఎరువులు కూడా ఎంతో అవసరం. వ్యవసాయాధికారులు మాత్రం ఎక్కడో ఉండి రైతులకు సరైన సలహాలు, సూచనలు ఇవ్వడం లేదు. నేటికీ రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో లేరు. వేరుశనగ కూడా ఉందో లేదో అని రైతులు చర్చించుకుంటున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఎరువులు కూడా లేవు. ప్రస్తుతం విత్తన వేరుశనగ కాయల కోసం రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వాటిని నమోదు చేసుకునేందుకు రైతులు కేంద్రాలకు వెళితే అధికారులు అందుబాటులో లేకపోవడంతో వెనుతిరిగి రావాల్సి వస్తోందని అంటున్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం ఎప్పుడూ మూసి ఉంటుందని రైతులు చెబుతున్నారు. వ్యవసాయాధికారి అందుబాటులో ఉండి సిబ్బందితోనూ రైతులతోనూ కలిసి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరుతున్నారు. మండలంలో 11 రైతు భరోసా కేంద్రాలున్నాయి. రైతులు మండలకేంద్రానికి రాకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం పంచాయతీ కేంద్రాల్లోని రైతు భరోసా కేంద్రాలను అందుబాటులో తీసుకువచ్చింది. దీనికి విరుద్ధంగా రైతు భరోసా కేంద్రాలు సక్రమంగా పనిచేయడం లేదని రైతులు వాపోతున్నారు.



అగళిలో తెరుచుకోని వ్యవసాయశాఖ కార్యాలయం

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

- వాహనదారులకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


తురకలాపట్నం రహదారిపై నిలిచిన వర్షపు నీరు

రొద్దం, మే 20: తురకలాపట్నం, రొద్దం గ్రామంలో ప్రధాన రహదారిపైనే వర్షపు నీరు నిలబడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్లుగా తురకలాపట్నం గ్రామం పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిపై వర్షం నీరు నిలబడుతుండటంతో వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల మలుపువద్ద, రాజారెడ్డి ఇంటికి ఎదురుగా ప్రధాన రహదారిపై వర్షపునీరు అధికంగా నిలబడుతోంది. అదేవిధంగా రొద్దం గ్రామంలోని వైఎస్‌ఆర్ సర్కిల్ సమీపంలో రోడ్డుపై వర్షపు నీరు నిలబడి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డుపైనే నీరు నిలబడుతోంది. ఎన్నోమార్లు ఆ శాఖ అధికారులు అటుగా వెళ్లినప్పుడు విషం తెలిసినా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

విత్తన వేరుశనగ కోసం పేర్లు నమోదు చేసుకోండి

పెనుకొండ రూరల్, మే 20: ప్రభుత్వం రాయితీతో అందించే విత్తన వేరుశనగ కోసం రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి చందన ఒక ప్రకటనలో కోరారు. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగుచేసే రైతులకు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనకాయలు అందిస్తున్నట్లు తెలిపారు. కే6 రకం 30కిలోల బస్తా ధర రూ.1700, ఒక రైతుకు మూడు బస్తాల చొప్పున 90కిలోలకు రూ.5130చెల్లించాలన్నారు. అర్హులైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్‌నంబరుతో సంబంధిత రైతు భరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు.

బాటిల్‌లో పెట్రోల్ పడితే కేసులే


పెట్రోల్ బంక్ వద్ద ఫ్లెక్సీ చూపుతున్న పోలీసులు

హిందూపురం, మే 20: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పెట్రోల్ బంకుల్లో బాటిళ్లకు ఎవరైనా పెట్రోల్ పడితే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. ఇందుకు సంబంధించి ఫ్లెక్సీలను పెట్రోల్ బంక్‌వద్ద ఏర్పాటు చేశారు. పోలీసులు మాట్లాడుతూ పెట్రోల్ బంక్‌లో బాటిల్‌లో పెట్రోల్ పోస్తే వారు ఏదైనా సంఘటన, నేరాల్లో పాల్పడితే మీపై కూడా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్, పోలీస్‌శాఖ ఆదేశాల మేరకు కస్టమర్లకు ఎవరికీ లూజుగా విక్రయించరాదన్నారు. దీన్ని ఎవరైనా అతిక్రమిస్తే ఎన్నికల కోడ్ ఉల్లంఘటనతోపాటు మీపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు.

దివ్యాంగులకు చట్టాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సొసైటీ సభ్యులు

రొద్దం, మే 20: దొడగట్ట గ్రామంలో దివ్యాంగులకు చట్టాలపై అవగాహన కల్పించారు. సోమవారం గ్రామంలోని ఆదర్శ వికలాంగుల సొసైటీ సంస్థ తరఫున దివ్యాంగులకు చట్టాలు, హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు, వాటి నుంచి ఎలా లబ్ధి పొందాలో వివరించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకుని సమాజంలో వాటి నుంచి రక్షణ పొందేందుకు అవగాహన పెంచుకోవాలన్నారు. లీగల్‌క్యాంప్ మేనేజర్ జయశ్రీ, వరలక్ష్మి, దివ్యాంగులు పాల్గొన్నారు.

గుడిబండకు చేరిన సబ్సిడీ విత్తన వేరుశనగ


వేరుశనగ బస్తాలు దించుతున్న కూలీలు

గుడిబండ, మే 20: మండలంలోని రాళ్లపల్లి, గుడిబండ, కరికెర, సి.సి.గిరి ఆర్బీకే కేంద్రాలకు 400 క్వింటాళ్ల సబ్సిడీ విత్తన వేరుశనగ చేరినట్లు ఏఓ వీరనరేష్ తెలిపారు. రైతులు ఆర్బీకే కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేస్తామని ఏఓ తెలిపారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన సిమెంట్ మిక్సర్


పొలంలోకి దూసుకెళ్లిన సిమెంట్, కంకర మిక్సర్ లారీ

మడకశిర రూరల్, మే 20: మండలంలోని గోవిందాపురం గ్రామ మలుపు వద్ద సోమవారం ఉదయం అదుపు తప్పి సిమెంటు, కంకర మిక్సర్ లారీ పొలాలలోకి దూసుకెళ్లింది. స్థానికులు అందించిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం శిరా నుంచి బాగేపల్లికి వెళుతున్న లారీ ఉదయం వేగంగా వస్తూ గోవిందాపురం రోడ్డు మలుపు వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లినట్లు తెలిపారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరుగలేదని తెలిపారు.